ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
శుక్రవారం | ఆగస్టు 21, 2026 | సంపుటి : 7 | సంచిక : 72 | పేజీలు : 2



# నా కూతురు వ్యక్తిగత అభిప్రాయం

## నన్ను బాధ్యత వహించాలనడం సముచితం కాదు

- టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ
- తన వివరణతో కూడిన లేఖను టిపిసిసి క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి కి పంపించిన మంత్రి సురేఖ



**హైదరాబాద్, ఆయుధం:** కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి వివరణ ఇచ్చారు. తన కూతురు వ్యక్తిగత అభిప్రాయానికి తనకు సంబంధం లేదని.. తనను బాధ్యత వహించాలనడం సముచితం కాదని ఆమె పేర్కొన్నారు. టిపిసిసి క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు సంబంధించి అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం తన వివరణతో లేఖను కమిటి చైర్మన్ మల్లు రవి కి పంపించారు. లేఖలో క్రమశిక్షణా కమిటీకి మంత్రి తన వివరణ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆగస్టు 19న తన జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'కొండా' కుటుంబ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలుచోట్ల వేడుకలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారని లేఖలో మంత్రి తెలిపారు. తన స్వస్థలమైన గీసుకొండతో తన కూతురు సుస్మితా పటేల్ కు వున్న ప్రత్యేక అనుబంధం కారణంగా అక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని వివరించారు.

ఆ కార్యక్రమంలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమని మంత్రి స్పష్టం చేశారు. కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, ఆ ప్రాతిపదికన వివరణ కోరడం సముచితం కాదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ విషయంలో తన ప్రమేయం లేదని గుర్తించి, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణా కమిటీకి గౌరవపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

### చల్లాకు భయపడి పరకాలను వీడారు

- సుస్మితా.. నీ స్థాయి తెలుసుకుని మాట్లాడు
- రాజకీయంగా ఎదగాలంటే ముందు భాష మార్చుకో
- సీఎం రేవంత్, ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు ఖండిస్తున్నాం
- మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య

2 లో



### కొండా సుస్మిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచ రాములు నిరాహార దీక్ష

2 లో

### పార్టీలు మారిన వారికి కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు

- సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం..
- పార్టీకి నష్టం కలిగించేలా బహిరంగ వేదికలపై మాట్లాడటం సరికాదు: డీసీసీ అధ్యక్షుడు అయూబ్

2 లో



### ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతి

- డీసీసీ భవన్, ఎంజీఎం సెంటర్‌లలో నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు
- ఆధునిక భారత సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ ఆద్యుడు: డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**హనుమకొండ, ఆయుధం:** భారతదేశ మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతిని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ ప్రెసిడెంట్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో డీసీసీ కార్యాలయం, ఎంజీఎం సెంటర్ లలో వేడుకలు జరిగాయి. డీసీసీ భవన్‌లో ఆయన చిత్రపటానికి, ఎంజీఎం సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయ్యూబ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు, టీపీసీసి మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, వరంగల్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, IYC జాతీయ కార్యదర్శి సాగరిక రావు, చైర్మన్లు అజీజ్ ఖాన్, టీపీసీసి జనరల్ సెక్రేటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అనుబంధ సంఘాల చైర్మన్లు తదితరులు కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. 21వ శతాబ్దపు ఆధునిక భారతదేశ నిర్మాణానికి, దేశంలో నేడు మనం చూస్తున్న ఐటీ, టెలికాం, కంప్యూటర్ విప్లవానికి రాజీవ్ గాంధీ బీజం వేశారని కొనియాడారు. రాజీవ్ గాంధీ జన్మదినాన్ని దేశవ్యాప్తంగా మనం 'సద్భావనా దివస్' గా జరుపుకుంటున్నామని, దేశంలో శాంతి, ఐక్యత, మతసామరస్యాన్ని పెంపొందించడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశం అన్నారు. రాజీవ్ గాంధీ కేవలం ఒక ప్రధానమంత్రి మాత్రమే కాదని, 21వ శతాబ్దపు ఆధునిక భారతదేశానికి ఆయన ఆద్యుడు. కేవలం యువత దేశ రాజకీయాల్లో భాగస్వాములు కావాలని 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన మహోన్నత నాయకుడని, పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామాలకు అధికారాలను వికేంద్రీకరించి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని గుర్తుచేశారు. దేశ ఐక్యత, మతసామరస్యం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుడు రాజీవ్ గాంధీ అని, ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు.

### మంత్రి సురేఖ మాజీ ఓఎస్డీపై కేసు నమోదు



**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కేసు నమోదైంది. సుమంత్ తనను బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశారని ఓ వ్యాపారి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వనందుకు తనపై దాడి చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. మొదట మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి జూబ్లీహిల్స్ పీఎస్‌కు బదిలీ చేశారు.



### జీ.వో. 97 శక్తి పథకాన్ని రద్దు చేయాలి

- పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నాకు దాస్యం వినయ్ భాస్కర్ సంఘీభావం



**వరంగల్, ఆయుధం:** గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులు G.O. 97 ద్వారా అమలు చేస్తున్న శక్తి పథకం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నాకు మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ సంఘీభావం తెలిపారు. విద్యార్థుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న దాస్యం వినయ్ భాస్కర్, వారి డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో కలిసి ములుగు రోడ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపే నిర్ణయాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. G.O. 97 ద్వారా శక్తి పథకాన్ని రద్దు చేసి, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని, విద్యార్థుల ఆందోళనను అణచివేయడం కాకుండా వారితో చర్చించి న్యాయం చేయాలని అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అవసరమైతే మరింత బలంగా పోరాడుతామని దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. అనంతరం దాస్యం వినయ్ భాస్కర్ గారిని అరెస్టు చేసి మట్వేవాడ పోలీస్ స్టేషన్ కి తరలించారు తన సొంత పూచికత్ పై విడుదల చేశారు.



### ఘనంగా కుసుమ జగదీశ్ జయంతి

- 80 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ



**జేడీ మల్లంపల్లి, ఆయుధం:** ములుగు జిల్లా తొలి జెడ్పీ చైర్మన్, బిఆర్ఎస్ నేత కుసుమ జగదీశ్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జేడీ మల్లంపల్లి మండల కేంద్రంలోని ఇంటివద్ద స్వర్గీయ జేడీ చిత్రపటానికి కుటుంబ సభ్యులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8,9 తరగతులు చదువుతున్న 80 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా కుసుమ జగదీశ్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ములుగు ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం తపించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పేద ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. పేద విద్యార్థులు చదువులో రాణించాలని ఆలోచించి ఉన్నత విద్య చదువులకు ఆర్థిక సహాయం అందించారని, కరోనా మహమ్మారి సమయంలో ఎందరికో అండగా నిలిచారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరం అన్నారు. స్వర్గీయ జేడీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి తాము పాటుపడతామని స్పష్టం చేశారు. జేడీ ఆశయ సాధనను పాటుపడితేనే నిజమైన నివాళి అన్నారు. చిన్న వయసులో మంచి నాయకుడిని బిఆర్ఎస్ కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో కుసుమ జగదీశ్ తండ్రి, మాజీ సర్పంచ్ కుసుమ ఆదినారాయణ, బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న, బత్తోజు ద్రోణాచారి, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, దేవనగరం మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రావు, వార్డు సభ్యుడు పాషా, నాయకులు భూక్య దేవేందర్, నల్లాల చంద్రమౌళి, పెద్ది రాకేష్ రెడ్డి, రంజాన్, మాచర్ల రాజమౌళి, లింబాద్రి, రేణుకుంట్ల సురేష్, మొర్రి రాజు, చోటు, రమేష్, రాజు, కుక్కల సంపత్, మహేందర్, తూర్పాటి మధు పాల్గొన్నారు.



### విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

- తిమ్మాపూర్ బీసీ గురుకుల పాఠశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ
- విద్యార్థినులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి
- చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన

**ఎల్కతుర్తి, ఆయుధం:** భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర మంత్రి పొన్నం (మిగతా 2లో..)



# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

- దేశ ప్రగతికి, సాంకేతిక అభివృద్ధికి ఆయన అందించిన కృషి మరువలేనిది
- ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి
- విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు, ఎంఎల్సీ సారయ్య, జిల్లా పార్టీ అధ్యక్షులు ఇనుగాల, అయూబ్

**వరంగల్, ఆయుధం:** ఆధునిక భారత నిర్మాణానికి, దేశ ప్రగతికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయం అని, యువతకు మార్గదర్శిగా, దేశ అభివృద్ధికి దారిచూపిన మహానేతగా ఆయన ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకులని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ కొనియాడారు. రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా MGM కూడలి లోని ఆయన విగ్రహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, ఎంఎల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకట్రాజం, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, మాజీ మేయర్ గుండు సుధారాణితో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి దేశానికి ఆయన సేవలను సర్పించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ... "దేశ సమగ్ర అభివృద్ధి, ఆధునిక సాంకేతికత, యువతకు అవకాశాల కల్పన కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే దూరదృష్టితో ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ భారత ప్రగతికి పునాదులుగా నిలిచాయి.


యువతకు మార్గదర్శిగా, 18 సం. రాలకు ఓటు హక్కు కలిగి వారి భవిష్యత్తుకు బాటలు వేసిన మహానేత రాజీవ్ గాంధీ గారు. యువతను దేశ భవిష్యత్తుగా భావించి వారికి విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు అందించేందుకు రాజీవ్ గాంధీ గారు విశేష కృషి చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు పాలనలో భాగస్వామ్యం కల్పించాలనే ఆయన ఆలోచన ఎంతో గొప్పది.

దేశం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహానేత రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్లు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, టౌన్, గ్రామ స్థాయి అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

(మొదటి పేజీ తరువాయి..)

సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులతో ముచ్చటించి వారి చదువులు, వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందుతున్నాయా లేదా అని మంత్రి ఆరా తీశారు. విద్యార్థినుల ఆరోగ్యం, విద్యతో పాటు వారికి అందుతున్న సౌకర్యాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో విద్యా విషయాలపై మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుతో పాటు విద్యార్థినులలో ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కరికులం యాక్టివిటీస్‌ను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినులతో సరదాగా ముచ్చటిస్తూ పాటలు పాడించారు, కథలు చెప్పించారు. ప్రతిభ కనబరిచి పాటలు పాడిన విద్యార్థినులను మంత్రి సత్కరించి అభినందించారు. రేపటి భవిష్యత్‌పై స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. తాము చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్య, క్రమశిక్షణతో పాటు ప్రతిభను పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



# సీకేఎం ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

**వరంగల్, ఆయుధం:** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా వరంగల్ సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మిసాల ప్రకాష్ చేతుల మీదుగా పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1984లో రాజీవ్ గాంధీ భారత ప్రధాన మంత్రి పదవి చేపట్టారు. రాజీవ్ గాంధీ భారత ప్రభుత్వంలో ఆధునీకరణ, ఉదారీకరణపై దృష్టి సారించి కంప్యూటర్లు, టెలికమ్యూనికేషన్ వంటి రంగాల్లో అతి ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టారు. రాజీవ్ గాంధీని భారతదేశంలో సమాచార విప్లవ పితామహుడిగా పరిగణిస్తారు. దేశంలో కంప్యూటరైజేషన్, టెలికమ్యూనికేషన్ విప్లవ ఘనత ఆయనకే దక్కుతుంది. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో ఆ రోజుల్లోనే మహిళలకు 33.శాతం రిజర్వేషన్ల కొరకు కృషి చేశారు. రాజీవ్ గాంధీ ఓటు హక్కును 21 ఏళ్ల నుండి 18 ఏళ్లకు తగ్గించి, యువతకు ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించారని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి భాషాపాక సదానందం, భద్రకాళి ధర్మకర్త జారతి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు ఇనుగాల శరత్, గూడ శారద, షాబోతు యోగి, షాబోతు రాణా దీప్, పోలేపాక యాకోబ్, పెద్ద గోపి, వారియొగుల శ్రీనివాస్, సందీప్, రజిత, తిరుమల్, అరుణ, రజిని, భాగ్యమ్మ, సరోజన, వజ్రమ్మ, రాజేష్, క్రాంతి, వేణు పాల్గొన్నారు.

# కార్మిక శాఖ లో దళారులను నియంత్రించాలి

- కార్మిక సంఘాల నేతల డిమాండ్




**వరంగల్, ఆయుధం:** కార్మిక శాఖలో దళారులను నియంత్రించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ శివనగర్ తమ్మెర భవన్ లో కార్మిక శాఖ లో దళారుల మరియు అధికారుల అవినావభావ సంబంధం తో కార్మికులు పైన ప్రభావం అనే అంశం పైన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గన్నారపు రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్, గంగుల దయాకర్, ముకెర రమాస్వామి మాట్లాడుతూ వరంగల్ జిల్లా వేదికగా కార్మిక శాఖ కార్యాలయంలో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులను అధికారులు వెంటనే క్లియర్ చేయాలని అదేవిధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన సహజ మరణాలు, ప్రమాద మరణాలు, తాత్కాలిక, పెర్మనెంట్ డిజేబులిటీలు, ప్రైవేటు ఇన్సూరెన్స్ ఏజెన్సీలకు కట్టబెట్టడం వల్ల ఒక సంవత్సర కాల పరిధిలోనే కార్మిక శాఖ సంక్షేమ బోర్డు నుండి వందల వేల కోట్ల రూపాయలు దళారుల ద్వారా లూటీ చేయడం జరిగిందని తెలిపారు. అధికారులకు, జిల్లా కలెక్టర్లకు, సంక్షేమ బోర్డు సీఈవో మరియు లేబర్ కమిషనర్లకు ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టలేదన్నారు. కార్మిక శాఖ కార్యాలయం ద్వారానే దరఖాస్తుల స్వీకరణ, సంక్షేమ లబ్ది నమోదు, నగదు జమ వంటివి కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరగాలని ఇందులో ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని దళారుల పాత్ర ఉండకూడదని పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక సంక్షేమ శాఖ అనేకమంది కార్మికులకు ఆర్థిక భరోసాగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లపెల్లి జాన్ పాల్, ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంగం జిల్లా అధ్యక్షులు ఎండి.యాకుబ్, జిల్లా ఆఫీస్ బేరర్ సంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలు మారిన వారికి కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు

- సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం..
- పార్టీకి నష్టం కలిగించేలా బహిరంగ వేదికలపై మాట్లాడటం సరికాదు: డీసీసీ అధ్యక్షుడు అయూబ్



**వరంగల్, ఆయుధం:** పది పార్టీలు మారిన వారికి కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. గురువారం MGM సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి, కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన కార్యకర్తలకు ప్రస్తుతం ఎలాంటి రాజకీయ అవకాశం, గుర్తింపు దక్కిందో చెప్పాలని అయూబ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ కోసం కష్టపడిన వారికా.. లేక అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అంటూ వర్గీకరించిన వారికా అవకాశాలు కల్పించారో స్పష్టం చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కొంతమంది బహిరంగ వేదికలపై అవమానిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అదే వేదికపై ఎలా కొనసాగుతారని అయూబ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. "మేము ఐదుగురిని గెలిపించాం" అని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన అయూబ్, 2018 లో కాంగ్రెస్ పార్టీ నుంచి పరకాల నియోజకవర్గంలో పోటీ చేసిన వారు 2023లో కూడా పరకాల నుంచే పోటీ చేసి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదేమో కదా అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ కొండా సురేఖ కు అనేకసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా అవకాశం కల్పించిందని, అలాగే కొండా మురళి కి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తన నాయకులు, కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తూనే ఉందన్నారు.

పార్టీలో టికెట్ ఆశించే వారికి, తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే వారికి పార్టీ అంతర్గతంగా ఒక విధానం ఉంటుందని, బహిరంగ వేదికలపై పార్టీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని మహమ్మద్ అయూబ్ అన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవడంతో పాటు, పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు అండగా నిలవాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ కోరారు.

# టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరహత్ అలీ మాతృమూర్తి మృతికి జర్నలిస్టు నేతల సంతాపం



**గజ్వేల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) రాష్ట్ర అధ్యక్షులు కె.విరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున గజ్వేల్ లోని తమ నివాసంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న TUWJ (IJU) జాతీయ కౌన్సిల్ సభ్యులు, వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, TUWJ (IJU) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, TUWJF రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎ.మజీద్, జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ మోహినుద్దీన్, కమిటీ సభ్యులు, TUWJF ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సాజిద్ పాషా, కోశాధికారి మహమ్మద్ అమీర్ ఖాన్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మహమ్మద్ నయీం పాషా తదితరులు కార్యక్రమానికి హాజరై విరహత్ అలీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు బాషారత్ ఉన్నిసా బేగం ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.





# మల్లక్ పల్లి ట్రాక్టర్స్ యూనియన్ అధ్యక్షులుగా బైరపాక ఏలియా



**ధర్మసాగర్, ఆయుధం:** ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి ట్రాక్టర్స్ యూనియన్ అధ్యక్షులుగా బైరపాక ఏలియా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఏలియా ప్రస్తుతం మల్లక్ పల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడుగాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కు పాటుపడ్డారు. తనపై నమ్మకంతో తిరిగి ట్రాక్టర్స్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు సభ్యులకు రుణపడి ఉంటానని.. సంఘాన్ని అన్ని విధాలుగా ముందు వరుసలో నిలుపుతానని అన్నారు. ఆర్థికంగా ముందు వరసలో నిలపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని, రైతులకు సరియైన న్యాయం చేకూర్చే విధంగా అందరం పనిచేయాలని ఏలియా అన్నారు. ఏలియా నియామకం పట్ల మల్లక్ పల్లి పలు రాజకీయ పార్టీల నాయకుడు యూత్ లు అభినందించాయి.




# సమన్వయంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం

- పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**వరంగల్, ఆయుధం:** వరంగల్ ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై గురువారం పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, ఎన్‌హెచ్ఏఐ పీడీ భరద్వాజ్‌తో పాటు ఆర్అండ్‌బీ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో నగరంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను ట్రాఫిక్ పోలీసులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్ల పనితీరు, వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో కొత్తగా సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన జంక్షన్లు, రోడ్లపై ఆక్రమణలు, తొలగించాల్సిన టెలిఫోన్, విద్యుత్ స్తంభాలు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, రోడ్డు మరమ్మతులు, యూటర్న్ ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్లు, ఆటో స్టాండ్లకు అనువైన ప్రాంతాల గుర్తింపు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ట్రైసిటీ పరిధిలో రాత్రి సమయాల్లో తగినంత వెలుతురు లేని 159 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటుకు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రోడ్డు మలుపులు, అనధికార పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు సంభవించే అవకాశమున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ అధికారులు సూచించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సమన్వయంతో పనిచేస్తే ట్రాఫిక్ సమస్యలను మరింత సమర్థవంతంగా పరిష్కరించవచ్చని పేర్కొన్నారు.

# చల్లాకు భయపడి పరకాలను వీడారు

- సుస్మితా.. నీ స్థాయి తెలుసుకుని మాట్లాడు
- రాజకీయంగా ఎదగాలంటే ముందు భాష మార్చుకో
- సీఎం రేవంత్, ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు ఖండిస్తున్నాం
- మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య



**పరకాల, ఆయుధం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పై కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలను పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని టిపిసిసి మాజీ జనరల్ సెక్రటరీ మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య పేర్కొన్నారు. గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ ఇస్తే నీకెందుకు, నీకు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వమే లేదు, పార్టీకి సంబంధం లేని వారు కాంగ్రెస్ అంతర్గత విషయాల్లో జోక్యం మానుకోవాలని హితవు పలికారు. సీఎం, ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాట్లాడే ముందు స్థాయి తెలుసుకోవాలని సూచించారు.

పరకాలలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పరకాల అభివృద్ధిని చూసి మరోసారి రేవూరి ప్రకాశ్ రెడ్డి ని ఆశీర్వదించండి అని కోరడాన్ని సుస్మిత విమర్శించడం ఏంటో అర్థం కావడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి భయపడి పరకాల నుంచి దూరంగా వెళ్ళిన కుటుంబం మీది అన్నారు. సందర్భం లేని విషయాలలో తలదూర్చి ఏదో తోచింది మాట్లాడి మంత్రి కొండ సురేఖ కు రాజకీయంగా నష్టం కలిగిస్తుంది నువ్వే అని గుర్తు చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కి టికెట్ ఇస్తే పార్టీ శ్రేణులంతా ఆయన విజయానికి కృషి చేస్తారని చెప్పారు. పరకాల మాది మాది అంటున్నావ్ నువ్వు పరకాలకు చేసింది ఏంటిదో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, వారికి పార్టీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మాజీ జడ్పిటిసి&డిసిసి ప్రధాన కార్యదర్శి పాడి కల్పనా దేవి మాట్లాడుతూ... "పరకాల గడ్డ ఎవరి అడ్డా కాదు... పరకాల గడ్డ కాంగ్రెస్ పార్టీ అడ్డా..."అని కొనియాడారు. 2012 సంవత్సరం నుంచి మీరు పరకాలకు దూరమయ్యారన్నారు. అలాంటి కుటుంబం నుంచి వచ్చి పరకాల గడ్డ నాది అనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయంగా ఎదగాలని ఉంటే నీ భాషను నీ వ్యక్తిత్వాన్ని మార్చుకొని ఎదగాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని, ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ని గాని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని ఈ సందర్భంగా హెచ్చరించారు.

నాగారం మాజీ సర్పంచి&డిసిసి సెక్రెటరీ కట్కూరి స్రవంతి మాట్లాడుతూ... సీఎం తో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్న మా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పై అనుచిత వాక్యాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో టిపిసిసి మాజీ జనరల్ సెక్రెటరీ భీమగాని సౌజన్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి పాడి కల్పనాదేవి, డిసిసి కార్యదర్శి కట్కూరి స్రవంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఏకు దివ్య, కౌన్సిలర్లు పోరండ్ల మౌనిక, బొచ్చు సుభద్ర, మాజీ కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, డైరీ ఫాం ప్రెసిడెంట్ కచ్చకాయల అరుణ, వైస్ ప్రెసిడెంట్ మోరె కవిత, మహిళా కాంగ్రెస్ నాయకులు లక్ష్మీ రావు, లక్కం వసంత, దాసరి పద్మ, కవిత ఎండి. రహేమా, అడప రమ తదితరులు పాల్గొన్నారు.



# కొండా సుస్మిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచ రాములు నిరాహార దీక్ష

**జనగామ, ఆయుధం:** సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచ రాములు 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేయడం సరికాదని, సుస్మిత వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కొమురవెల్లి దేవస్థానం చైర్మన్ పదవిని రెడ్డి సామాజిక వర్గానికి ఎందుకు కట్టబెట్టారో మంత్రి కొండా సురేఖ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తనపై కేసులు ఉన్నాయనే నెపంతో పదవి నిరాకరించిన కొండా సురేఖ, కేసులు ఉన్న కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఎలా అడుగుతున్నారని నిలదీశారు. రేవంత్ రెడ్డిపై అచ్చ కాంగ్రెస్.. పచ్చ కాంగ్రెస్ అని వ్యాఖ్యానించే ముందు, కొండా దంపతులు ఎన్ని పార్టీలు మారారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు.



# ప్రాణ రక్షణ కల్పించండి

- ఎస్పీకి బాధితుడి వినతి

**ములుగు, ఆయుధం:** ఇసుక క్వారీ డబ్బులు, చెక్కుల వ్యవహారంలో తలెత్తిన వివాదంతో తనను వెంబడించి కారును అడ్డుకుని దాడికి యత్నించారని బీఆర్ఎస్ నాయకుడు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ చందా చక్రపాణి ఆరోపించారు. మారణాయుధాలు, రాళ్లతో తన కారుపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారని పేర్కొంటూ ములుగు జిల్లా ఎస్పీకి బాధితుడు ఫిర్యాదు చేశారు. తనకు ప్రాణరక్షణ కల్పించి, ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695